క్లుప్తంగా

శబరిమలకు దగ్గరలో స్వాములు



పులిమేరులో ముగ్గళ్లకు చెందిన స్వాములు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల నుంచి కాలి నడకన శబరిమలకు బయలుదేరిన గుర్రాల స్వామి, బత్తిన శ్రీను, బోండు భాను, దూలం రమణ, రుద్రం శ్రీను, ఉమ్మిడి బుల్లిరాజు గురువారం ఆ ఆలయానికి పదకొండు కిలోమీటర్ల దూరంలోని పులిమేరుకు చేరుకున్నారు. వీరు సెప్టెంబర్ 28న ముగ్గళ్ల నుంచి పాదయాత్ర ప్రారంభించారు. 47 రోజుల పాదయాత్రంలో ఐదు రోజులు వర్షం కారణంగా ఆగారు. వీరు ముగ్గళ్ల నుంచి శబరిమల చేరుకోవడానికి 42 రోజులు పట్టింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 16న ఆలయం తెరుస్తారని ఉదయం 8 గంటల నుంచి స్వామిరి దర్శనానికి అనుమతి ఇస్తారన్నారు.

నిత్యావసరాల వితరణ



నిత్యావసరాలు అందజేసిన దాతలు

రాజానగరం: లాలాచెరువు హెచ్‌బీ కాలనీలో గౌతమ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌజన్య మనోవికాస్ కేంద్రంలోని పిల్లలకు రాజమహేంద్రవరానికి చెందిన సాయి సమాఖ్య స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం నిత్యావసరాలు వితరణ చేసింది. రూ.31 వేలతో నెలకు సరిపడే సరకులను కొనుగోలు చేసి అందించింది. అలాగే బాలల దినోత్సవం సందర్భంగా పిల్లలకు భోజనాలు సమకూర్చింది. ముందుగా మాజీ ప్రధాని నెహ్రూ, జాతిపిత గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ కె.శంకర్రావు, సంస్థ ప్రతినిధి డి.మంజు, సుభాషిణి, సంధ్య, నీతి మాధవి, వెంకటలక్ష్మి, నిఖిత పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలి



శిక్షణలో పాల్గొన్న అధికారులు

బిక్కవోలు: ప్రణాళికాబద్ధంగా మండలాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 2025–26 ఏడాదికిగానూ అభివృద్ధి ప్రణాళికలను ఎలా రూపొందించాలో జిల్లా స్థాయి శిక్షణ పొందిన డిజిటల్ అసిస్టెంట్ సూరిశెట్టి సురేష్, పంచాయతీ కార్యదర్శులు జి.అశోక్ కుమార్,అహ్మద్ ఆలీలు శిక్షణ ఇచ్చారు. పంచాయతీ విస్తరణాధికారి జాన్ మిల్టన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో ఘనంగా అయ్యప్ప పడిపూజ చేశారు. బుధవారం రాత్రి గురజాపు వీర వెంకట సత్యనారాయణమూర్తి (అన్నవరం)గురుస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా అరటి డొప్పలతో అయ్యప్ప మండపం ఏర్పాటు చేసి అందులో గణపతి, అయ్యప్ప, సుబ్రహ్మణ్యేశ్వరుడు, కనకదుర్గమ్మ చిత్రపటాలను ఏర్పాటు చేశారు. రొంగల దుర్గా ప్రసాద్, వెంకట సత్య దంపతులతో అర్చకులు గరిమెళ్ల విశ్వేశ్వరరావు పూజలు చేయించారు. అనంతరం భజనలు చేసి పడి తొక్కరు.

గ్రామాల్లో వైద్యపరీక్షలు

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్‌సీడీ సీడీ-03 ఇంటింటి ఆరోగ్య స్క్రీనింగ్ కార్యక్రమాన్ని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్లు ఏవీకే చైతన్య, ఎస్.రాజు, ఏసురాణి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సీతానగరం దేవాంగుల వీధిలో ఈ కార్యక్రమాన్ని డాక్టర్ రాజు ప్రారంభించారు. ఆయన ట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి రోజూ గ్రామంలోని ఐదు ఇళ్లను సందర్శించి, అక్కడ 18 ఏళ్ల నిండిన వారికి పరీక్షలు చేస్తారన్నారు. కేన్సర్ లక్షణాలను గుర్తించడంతో పాటు షుగర్, బీపీ, హిమోగ్లోబిన్ శాతాన్ని లెక్కిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్‌ఎన్ ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్లు దైవకృప, సుధాకర్, బీబీ స్వరూప, ఏఎన్‌ఎం సలీమా, మున్నీషా తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు తులాభారం

రాజానగరం: కార్తిక మాసంలో రెండో గురువారం సందర్భంగా స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కొంతమంది భక్తులు తమ చిన్నారులకు పటిక బెల్లంతో తులాభారం వేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్న హారతి అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. వచ్చే గురువారం ఇదే ఆలయంలో జరిగే గాయత్రి హోమం, కార్తిక వనసమారాధనకు సంబంధించిన పోస్టర్లను పంపిణీ చేశారు.

వెచ్చని నేస్తాలు

- రోడ్డు పక్కనే ఉన్ని దుస్తుల దుకాణాలు
- పెరుగుతున్న చలి నేపథ్యంలో జోరుగా విక్రయాలు
- పెరిగిన ధరలతో ప్రజల బెంబేలు



కోరుకొండలో హెస్కూల్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల దుకాణం

మధురపూడి: చలికాలం వచ్చేసింది. ఇప్పటి వరకూ ఎండలు, ఉక్కబోతతో ఇబ్బంది పడిన ప్రజలు చల్లటి గాలులతో సేద తీరుతున్నారు. ఇదే సమయంలో రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోతున్నాయి. క్రమంగా మంచు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఉన్ని దుస్తుల అవసరం పెరిగింది. ముఖ్యంగా ఏజెన్సీకి ఆనుకుని ఉద్యానవనాలు, కొండలతో నిండిన కోరుకొండ మండలానికి చలి తీవ్రత ఎక్కువైంది.

జోరుగా విక్రయాలు

వాతావరణం మారి చలి పెరగడంతో వెచ్చిన దుస్తులకు డిమాండ్ ఏర్పడింది. దీంతో ఉన్ని దుస్తుల దుకాణాలు ఎక్కడికక్కడ వెలిశాయి. వీటి కొనుగోళ్ల కూడా జోరుగా సాగుతున్నాయి. కోరుకొండ మండలం కాపవరం, కోరుకొండ, పశ్చిమ గానుగూడెం గ్రామాల్లో మెయిన్ రోడ్లపై స్వెట్టర్లను విక్రయిస్తున్నారు.

నేపాల్ దుస్తులంటే మక్కువ

నేపాల్ దుస్తులంటే ప్రజలకు మక్కువగా ఉంది. వీటి నేత చాలా బాగా ఉండడంతో పాటు బట్ట మన్నికగా ఉంటుంది. చలి నుంచి కాపాడి, శరీరానికి వెచ్చదనం ఇస్తాయి. వీటిని స్థానికంగా నేపాల్ (దుస్తులు) కోట్లు అని పిలుస్తాయి. నేపాల్, రాజస్థాన్, ఢిల్లీ, చెన్నై తదితర ప్రాంతాలకు చెందిన వారు స్థానికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని వీటిని విక్రయిస్తున్నారు. ఇలా కోరుకొండ మండలంలో నాలుగు దుకాణాలు ఉన్నాయి.

ధర ఎక్కువే..

నేపాల్ కోట్ల ధర మాత్రం ఎక్కువగానే ఉంటోంది. మంకీ టోపీలు, మఫ్లర్లు, చలికోట్ల (స్వెటర్ల)ను రూ.350 నుంచి రూ.2,500 వరకూ విక్రయిస్తున్నారు. ఇంకా నాణ్యత కలిగిన దుస్తులు కావాలంటే రూ.2 వేల నుంచి రూ.4,500 వరకూ చెబుతున్నారు. గతంలో కంటే ఈ ధరలు బాగా పెరిగిపోయాయి.

ధరలు పెరిగాయి



ఉన్ని దుస్తుల ధరలు బాగా పెరిగిపోయాయి. నేపాల్ దుస్తులంటే మా ఇంట్లో అందరికీ చాలా ఇష్టం. గతంలో కుటుంబంలోని సభ్యులందరికీ కొనుగోలు చేసేవాడిని. అయితే పెరిగిన ధర కారణంగా ఈసారి వృద్ధులకు, పిల్లలకు మాత్రమే తీసుకున్నాను.

– పసుపులేటి బుల్లియ్య నాయుడు, కోరుకొండ

ఉపశమనం



చలి పెరుగుతున్న నేపథ్యంలో ఉన్ని దుస్తులు చాలా ఉపశమనం కలిగిస్తాయి. తెల్లవారుజామున లేచి పనులు చేసుకోవడానికి, రైతులు పొలాల్లోకి వెళ్లేటప్పుడు వీటి అవసరం ఎక్కువ. లేకపోతే చలి కారణంగా జలుబు, దగ్గు, ఊపిరి తిత్తుల వ్యాధులు సోకుతున్నాయి.

– ఆనందపాల్, గాదరాడ



జంబూపట్నంలో ఉన్ని దుస్తులను విక్రయిస్తున్న నేపాల్ దేశస్తుడు

నెహ్రూ ఆశయ సాధనకు కృషి



దివ్యకు బహుమతి అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గ్యాస్ కంపెనీ ప్రతినిధులు



కొంకుదురులో నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు



దివాన్‌చెరువు ఎంపీపీ మోడల్ పాఠశాలలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

బిక్కవోలు: పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బిక్కవోలు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పళ్లా వీర ప్రభాకర్ అన్నారు. గురువారం పాఠశాల వద్ద మాజీ ప్రధాని నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు ఆయన ఆశయ సాధనలో ముందుకు నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి మండలంలో..

పెదపూడి: అనపర్తి మండలం కుతుకులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా శారదాదేవి ఇండేన్ గ్యాస్ కంపెనీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ముందుగా దివంగత మాజీ ప్రధాని జవర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్యాస్ కంపెనీ అధినేతలు తాడి సంగిరెడ్డి, మేడపాటి సురేష్‌రెడ్డి(బుజ్జి) మాట్లాడుతూ విద్యార్థులు ఇంటి వద్ద తల్లిదండ్రులకి గ్యాస్ వాడకంపై పాటించాల్సిన జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు గ్యాస్ కంపెనీ నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

రాజానగరం మండలంలో..

రాజానగరం: మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నామవరంలోని భారతీయ విద్యా భవన్‌లో నెహ్రూ చిత్రపటానికి ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. రాజానగరంలోని దివ్య పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు ఎంతఊలు రామన్నదొర, జ్యోతిప్రసాద్‌ల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. చైర్మన్ బర్ల సత్యనారాయణ, వైస్‌చైర్మన్ విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాజానగరంలోని హర్షవర్ధన, కృషి పబ్లిక్ స్కూల్,కానవరంలోని గాయత్రీ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి. దివాన్‌చెరువులోని ఎంపీపీ మోడల్ ప్రాథమిక పాఠశాలలో గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎండి ధనరాజ్ పర్యవేక్షణలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ షేక్ మీరా ఆధ్వర్యంలోఈ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం కెవి రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని గౌతమ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలోని సౌజన్య మనోవికాస కేంద్రంలోను బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.

దేశ ప్రగతికి దారి చూపిన నెహ్రూ

సీతానగరం: సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ హైస్కూల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ కె.హరే రామకృష్ణ మాట్లాడుతూ ఆధునిక భారతదేశ ప్రగతికి దారి చూపిన దార్శనికుడు నెహ్రూ అన్నారు. తెలుగు అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధామయి, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రభుత్వ హైస్కూల్లో హెచ్‌ఎం వీరభద్రం అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

బొబ్బిల్లంక విద్యార్థినికి బహుమతి

బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్వహించిన వక్తృత్వ పోటీలో బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని అరిగెల దివ్య తృతీయ బహుమతి అందుకుంది. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో కలెక్టర్ ప్రశాంతి, జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని దివ్యను ఉపాధ్యాయులు, పీఎంసీ కమిటీ సభ్యులు అభినందించారు.

ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలి



ఎంపీడీఓ ఝాన్సీకి వినతిపత్రం అందజేస్తున్న 108 సిబ్బంది

రాజానగరం: తమ వేతనాలను ప్రైవేట్ సంస్థల ద్వారా కాకుండా నేరుగా ప్రభుత్వమే చెల్లించాలని 108 సిబ్బంది (ఈఎంటీ, పైలెట్) విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానికంగా ఉన్న 108 ఉద్యోగులు గురువారం ఎంపీడీఓ ఝాన్సీ, తహసీల్దారు లక్ష్మీలావణ్యకు వినతి పత్రాలు అందజేశారు. ప్రమాదాల బారిన పడిన వారిని సకాలంలో ఆస్పత్రులకు చేరుస్తూ, వారి ప్రాణాలను కాపాడటానికి బాధ్యతాయుతంగా పనిచేస్తున్నామన్నారు. తమకు ఇచ్చే జీతాలు తక్కువైనా, వాటిని సకాలంలో చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం ఆయా నిర్వహణా సంస్థలకు ఎప్పటికప్పుడు నిధులు సమకూరుస్తున్నా, ఆ సంస్థల నుంచి తమకు జీతాలు మంజూరు చేయడంలో నెలల తరబడి జాప్యం జరుగుతోందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం సహృదయంతో ఆలోచన చేసి, తమకు న్యాయం చేయాలని కోరారు.

అమరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి



శహపురం సంస్మరణ సభలో మాట్లాడుతున్న వీరాంజనేయులు

పెదపూడి: అమరుల పోరాట స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారానికి అంతా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం(ఏపీఆర్‌సీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. శహపురం గ్రామంలో కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి 40వ వర్ధంతిని పురస్కరించుకుని ఏపీఆర్‌సీఎస్, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ప్రజాసంఘాల అధ్వర్యంలో సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం, పీడిత ప్రజల విముక్తి కోసం భారత విప్లవ ఉద్యమంలో అసువులు బాసిన గొప్ప నాయకుడు పుల్లారెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు వల్లూరి రాజబాబు, మడికి సత్యం, బొచ్చా ఏసుబాబు, కుంచె అంజిబాబు, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమైక్యతను చాటే వన సమారాధనలు



ఉసిరి చెట్టుకు నమస్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: సమైక్యతకు చిహ్నంగా వన సమారాధనలు నిలుస్తాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. దివాన్ చెరువులో పండ్ల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం చెలుమూరి వెంకట శ్రీనివాస్ తోటలో కార్తిక వన సమారాధన జరిగింది. ఈ కార్యక్రమానికి జక్కంపూడి రాజా ముఖ్యఅతిథిగా హాజరై, ఉసిరి చెట్టుకుప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను పండ్ల వర్తకులందరూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, పండ్ల వర్తకులు పాల్గొన్నారు.

వంగలపూడి ర్యాంపులకు అనుమతుల్లేవు

సీతానగరం: వంగలపూడి ఇసుక ర్యాంపులకు పర్యావరణ అనుమతులు లేవని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఫాస్ట్ జస్టిస్ వైస్ ప్రెసిడెంట్, అడ్వకేట్ యార్లగడ్డ శ్రీనివాసరావు ఆరోపించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. అనుమతులు తీసుకునే ముందు ప్రభుత్వం వంగలపూడి ర్యాంపుల కోసం సరైన సరిహద్దులను చూపాలన్నారు. అక్రమ ఇసుక తవ్వకాల వల్ల రైతుల భూములు కోతకు గురవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. భారీ జేసీబీలు, భారీ ట్రక్కులతో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, వీటి కారణంగా రోడ్లు ధ్వంసమవుతున్నాయన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మధురపూడి: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, వాటి గురించి సమాజానికి అవగాహన కల్పించాలని ఎస్సై శ్యామ్ సుందర్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు గోల్డెన్ ఆఫర్ల పేరిట ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడం కోసం 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు సైబర్ నేరాన్ని గుర్తించిన వెంటనే ఆ నెంబర్‌ను తెలియజేయాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్) దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. పల్ల కడియం, రామస్వామిపేట గ్రామాలతో పాటు సాక్షి ముద్రణ కార్యాలయానికి ఆ సమయంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మిర్తిపాడు విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కోసం శుక్రవారం 11 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ నేపథ్యంలో మిర్తిపాడు, ఉండేశ్వరపురం, ములకల్లంక, బొబ్బిల్లంక గ్రామాలకు, ఉపకేంద్రం పరిధిలోని వ్యవసాయ బోర్లు, ఇండస్ట్రియల్ ఫీడర్లకు శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ సరఫరా ఉండదు.

బోరు నిర్మాణానికి భూమిపూజ

రంగంపేట: మండల పరిధిలోని సుభద్రంపేట గ్రామంలో గురువారం తాగునీటి బోరు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉండటంతో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాలతో 15వ ఆర్థిక సంఘం నిధులతో బోరు నిర్మాణం చేపట్టారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూటి సాయితాతారావు, బీజేపీ నాయకులు సాయిరాం, పేపకాయల రామచంద్రరావు, ఎన్డీఏ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధితోనే దేశ ప్రగతి

మధురపూడి: గ్రామ పంచాయతీ అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని, దానికోసం అధికారులు సమష్టిగా కృషి చేయాలని కోరుకొండ ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్ అన్నారు. కాపవరంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులకు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ శిక్షణ ప్రత్యేక అధికారి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి టి.కుశలవ దొర, పంచాయతీరాజ్‌శాఖ విస్తరణాధికారి మహేశ్వర ప్రతాప్ పాల్గొన్నారు.

రాజానగరం: గ్రామాల అవసరాలకు అనుగుణంగా రాబోయే ఆర్థిక సంవత్సరానికి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకోవాలని ఎంపీడీఓ జీఏ ఝాన్సీ సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో గురువారం జీపీడీపీ, బీసీడీపీ, డీపీడీపీలపై శిక్షణ నిర్వహించారు.

రెవెన్యూ గ్రామసభ

బిక్కవోలు: మండలంలోని భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ కృష్ణ అన్నారు. గురువారం కాపవరం పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రెండు రోజులు ఈ గ్రామంలో సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తొలిరోజు 126 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

విద్యార్థుల భవితకు గ్రంథాలయాలు మార్గదర్శకాలు



రాజానగరం గ్రంథాలయంలో విద్యార్థులు, ప్రముఖులు

రంగంపేట: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు గ్రంథాలయాలు మార్గదర్శకాలని పంచాయతీ కార్యదర్శి వి. శ్రీరామమూర్తి అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ పౌరులు సామాజిక బాధ్యతగా గ్రంథాలయాలను పరిరక్షించుకోవాలన్నారు. విజ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనమే ఏకైక సాధనమన్నారు. మరో అతిథిగా పాల్గొన్న పోస్టుమాస్టర్ పి.రవికుమార్‌దొర మాట్లాడుతూ మేధస్సు పెంపొందించుకొనేందుకు గ్రంథాలయాల ఆవశ్యకత అవసరమన్నారు. అంతకు ముందు గ్రంథాలయాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి విద్యార్థులు, పాఠకులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బిక్కవోలు: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. గురువారం కొంకుదురు గ్రామంలోని శాఖా గ్రంథాలయం వద్ద 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. శాఖా గ్రంథాలయ అధికారి ఎన్ బాల పాల్గొన్నారు.

పెదపూడి: అనపర్తి మండలంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. గురువారం అనపర్తి దార్వంపూడి బుల్లమ్మాయి జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలోని గ్రంథాలయ అధికారి జి.అభిలాష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజానగరం: ప్రపంచ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడతాయని స్థానిక ఎంపీపీ పాఠశాల – 2 హెచ్‌ఎం పీవీవీ భీమేశ్వరరావు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చాచా నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గ్రంథాలయాధికారి కలగర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం గ్రంథాలయంలో లైబ్రేరియన్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో వారోత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత హెచ్‌ఎం బి.భాస్కరరావు, అధ్యాపకుడు పి.కుమార్ హాజరయ్యారు.



రంగంపేట గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభిస్తున్న కార్యదర్శి శ్రీరామ్మూర్తి



అనపర్తిలో నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు



సీతానగరం గ్రంథాలయంలో..